
“ఒరేయ్, చలం, జలుబు చేస్తే మిరియాలు వేయించి పొడి చేసి ఆ పొడిని నశ్యంగా పీలుస్తే జలుబు మళ్ళీ రానే రాదట్రా.

# చిట్కాయణం

—భట్టిప్రోలు విజయలక్ష్మి



కొంచెం మిరియాల పొడి తేనా?” అదే పనిగా తుమ్ముతున్న కొడుకుని అడిగింది సావిత్రి.

“అవును. మళ్ళీ జలుబు చేయటానికి మనిషి బ్రతికుంటే కదా! అబ్బా... అసలే నా తుమ్ములు, జలుబుతో చస్తుంటే మధ్యలో నీ చిట్కాల గోలేమిటే?” విసుక్కున్నాడు చలం.

“నిజంగారా. ‘అదేదో’ పత్రికలో ఇవాళే చదివా. వాళ్ళు కాస్త స్టాండర్డు పత్రిక వాళ్ళు. అబద్ధాలు రాయరు” చెప్పింది సావిత్రి.

“నువ్వూ, నీ ‘అదేదో’ సంతకెళ్ళ! అడ్డమయిన చిట్కాలతోనూ చంపుకు తింటున్నావు. నన్ను నా తుమ్ములకి వదిలెయ్యి” తుమ్ముతూ అన్నాడు చలం.

“నీ కసలు చిట్కాలంటే నమ్మకం లేదు. అవి అసలు ఎంత తొందరగా పనిచేస్తాయంటే...”

చెప్తున్న తల్లికి అడ్డుపడి అన్నాడు చలం “అమ్మా! నేనూ ఒక పత్రికలో చదివానే. పిల్లలకి జలుబు చేస్తే తల్లి ఒక్క కాలికి చెప్పేసుకుని అరగంట సేపు అటూ ఇటూ తిరిగితే పోతుందిట’ ’విరాగ్గా అన్నాడు.

“నిజమే నంటావుట్రా? అయినా, చెప్పుకీ, జలుబుకీ ఏమిటి సంబంధం? ఏమోలే ఏ పుట్టలో ఏ పాముందో, ఏ చిట్కాలో ఏ మహత్తుందో? చెయ్యమంటావేమిటి?” సీరియస్‌గానే అడిగింది సావిత్రి.

“నా ఖర్మ” తలబాదుకున్నాడు చలం.

“సరే మిరియాల పొడి వద్దులేకానీ, క్రిందటి వారం ఆ ‘సూర్యుడే దిగివస్తే’ సీరియల్లో ఆ రైటరేం రాశాడంటే జలుబూ...”

“సూర్యుడే దిగివస్తే అందరం మలమల మాడి చచ్చిపోతాం. అసలు నువ్వు ఆ చెత్త పుస్తకాలు చదవటం మానెయ్యి. అవన్నీ చదివి నా ప్రాణం తీస్తున్నావు” విసుక్కున్నాడు చలం.

“అది కాదురా అబ్బాయి. నేను ఆ పుస్తకాల్లో అన్నీ చదవను. ఏవో చిట్కాలూ, సీరియల్సూ చదివి వదిలేస్తా. అంతే. అయినా అవి చదవటం వల్లే కదా మనింట్లో ఏ చిన్న ఇబ్బంది వచ్చినా ఏదో ఒక చిట్కా వాడి క్షణంలో బయటపడుతోందీ” సమర్థించుకొంది సావిత్రి.

“నా మొహం. కిందటి వారం ‘అదేదో’ పత్రికలో రాశారని వంకాయల్లో పురుగులు బయటికి రావటానికని కూరలో కిరసనాయలు వేసి చేశావా? కూరంతా పెంటపాలు. కిరసనాయిలు కంపు. మొత్తంపారేశాం గుర్తు లేదూ”.

“అది కాదురా. సమయానికి చెయ్యి వణికి ఒక్క ముక్క అంటే చెమ్చాడు పడిపోయింది. అంతే కాని చిట్కా తప్పు కాదు. అయినా కిరసనాయిలుకి పురుగులు చస్తాయన్నమాట నిజమే కదా?”

“మరింకేం. నువ్వు రోజూ ఉదయం, సాయంత్రం ఒక చెమ్చాడు కిరసనాయిలు తాగు. పొట్టలో బాక్టీరియా ఏమన్నా వుంటే చచ్చి ఊరుకుంటాయి. ఇంక ఏ రోగాలూ రావు” విరాగ్గా అన్నాడు చలం.

“అవునరోయ్. పోనీ కిరసనాయిలు స్ప్రై చేస్తేనేమిటి? రెండు ముక్కుల్లోనూ ఒక్కొక్క



ముక్కు వేశామంటే తుమ్ములు దెబ్బకి..." సావిత్రి మాట పూర్తి కానివ్వలేదు చలం.

"నన్నిలా తుమ్ముకుంటూ అయినా బ్రతకనీయవే తల్లీ, మళ్లీ ఏ చెవ్వో వణికిందని ముక్కుకి బదులు చెవ్వాదు పోసి హారీమనిపిస్తావు. హాఛ్ఛ....' ' తుమ్ముతూ అన్నాడు చలం.

అసలే ఆపకుండా తుమ్ములు. ఆపైన తల్లి చెప్పే చచ్చు చిట్కాల సలహాలు. చలానికి అరికాలి మంట నెత్తికెక్కుతోంది. సావిత్రి కనిపించిన ప్రతి పత్రిక, పేపరు చదువుతుంది. ఒకప్పుడు కేవలం వీక్లీలోనే కనిపించే ఈ చిట్కాల పరంపర ఇప్పుడు డైలీలలోనూ దర్శనం ఇవ్వడంతో చలం పని మరీ ఇరుకున పడింది. సావిత్రి వార్తలకన్నా ప్రాధాన్యం ఇచ్చి ఇష్టంగా, ముందుగా చదివేది చిట్కాలే. అసలు చిట్కాల కోసమే ఆవిడ రోజూ 'అదేదో' దినపత్రిక కొంటుంది. ఆదివారం ఆదివారం స్పెషల్‌గా వేసే చిట్కాల కోసం ఆ రోజుల్లో మరిన్ని పత్రికలు కొంటుంది.

ఒక్కోరోజు పేపరు చదివి పక్కనే 'రాజీవ్‌గాంధీ హత్య' లాంటి వార్తలు కూడా పట్టించుకోకుండా "ఒరేయ్, వంద వాట్ల బల్బు వేసి అయిదు నిముషాలు రెప్పార్పకుండా చూస్తే శుక్లం రాదుట" అంటుంది.

"అవును మరి. తరువాత ఆ కన్ను పనిచేస్తే కదా శుక్లం రావటానికి. గుడ్డి కన్నుకి శుక్లం వస్తే ఎంత? రాకపోతే ఎంత?" వెటకారం వేసేవాడు చలం.

తల్లి చిట్కాలు ఎన్ని చదివినా, ఎలాంటివి చదివినా చలానికేం అభ్యంతరం లేదు కానీ, చదివినవన్నీ ఆచరించాలని చూస్తుంది సావిత్రి. తల్లికీ కొడుక్కీ అక్కడే తగాదా వస్తుంది.

ఒకరోజు హేంగర్లు తగిలించే రాడ్ మీద హేంగర్లు తిన్నగా జారుతూ వుండాలంటే ఆ రాడ్‌కి కొబ్బరినూనె రాయాలని చదివి అప్పటికప్పుడు పెద్ద గరిటెడు కొబ్బరినూనె తెచ్చి ఆ రాడ్‌కి పూసింది. మర్నాడు ఆ బట్టలు వేసుకున్న అందరికీ విపరీతంగా చీమలు కుట్టి వళ్లు వాచిపోయింది.

మరోసారి కందకూరలో దురద పోవాలంటే ఉడకబెట్టే టప్పుడు రెండు నిమ్మకాయలు తరిగి వేయాలని ఎక్కడో చదివి ఆ విధంగా కందకూర చేస్తే ఆ కూర నోట్లో పెట్టుకున్న సావిత్రి భర్త అప్పటికప్పుడు గయవెళ్ళి కూరల్లో కంద, పళ్ళల్లో నిమ్మ వదిలేసి వచ్చాడు.

మరోసారి కొత్త చెప్పులు కరవకుండా వుండాలంటే వాటికి వేసుకునే ముందర లోపలి భాగంలో ఫెవికాల్ లాంటి గట్టిగా అతుక్కునే జిగురు పూయాలని చదివి చలం ముచ్చటపడి కొనుక్కున్న కొత్త బూట్లకి పూసింది. నాలుగు వందల రూపాయల బూట్లు వేసుకున్న తర్వాత విప్పటం చేతకాక చెప్పులవాడి దగ్గరికి వెళ్ళి బూట్లు కత్తిరింపించి కాళ్ళు క్షేమంగా బయటికి తెచ్చుకున్నాడు చలం.

ఆరోజు నించీ చలం తల్లి ఎన్ని చిట్కాలు చదివినా ఫర్వాలేదుకానీ అవి అమలు పరచాలంటే మాత్రం అతని అనుమతి తీసుకుని తీరాల్సిందే అని ఆర్డినెన్స్ జారీ చేశాడు. చలం చెల్లెళ్లు పెళ్ళిళ్లయి అత్తారిళ్లకి పోయి బ్రతికిపోయారు. చలం తండ్రి చచ్చిపోయి బ్రతికిపోయాడు. చలం మాత్రం పాపం బతికి చచ్చిపోయాడు. నిరంతరం అప్రమత్తంగా వుంటూ తల్లి చిట్కాల బారినుండి ఎలాగో తప్పించుకుంటూ బండి లాక్కొస్తున్నాడు చలం.

ఆ ముందు రోజు బాగా వానలో తడవటంతో జలుబు చేసి అలర్జీకి తుమ్ములు మొదలయ్యాయి చలానికి. కొడుక్కి తన మిరియాల పొడి నశ్యం, కిరసనాయిలు చిట్కాలు నచ్చకపోవడంతో మొహం చిన్నబుచ్చుకుని కూర్చుంది సావిత్రి. చలం మాత్రం విక్స్ పట్టిస్తూ, తుమ్ముతూ, ముక్కూ, మొహం కర్చీఫ్‌తో తుడుచుకుంటూ సతమతమవుతున్నాడు. కొడుకు బాధ చూడలేని సావిత్రి లోపలికెళ్ళి కర్చీఫ్ తెచ్చి యిస్తూ

"దీంతో తుడుచుకోరా చలం. దెబ్బకి నీ జలుబు తగ్గిపోతుంది" అంది.

"అంత ప్రత్యేకత ఏమిటీ ఈ కర్చీఫ్‌లో? తుడుచుకోనా? ప్రాణాపాయం లేదు కదా?"

అనుమానంగా అడిగాడు చలం ఎర్రబడ్డ ముక్కుని నలుపుతూ.

"అదేం లేదురా. మామూలు కర్చీఫే. కానయి తే దాన్ని ఇప్పుడే ఈకిలిప్యాయిల్‌లో (యూకలిప్టస్ ఆయిల్ అని సావిత్రి అర్థం) ముంచి తీశా".

తల్లి మాట పూర్తి చేసేలోపలే ఆ కర్చీఫ్‌తో మొహం తుడిచేసుకున్న చలం కెవ్వుమన్నాడు. మరో పావుగంట దాకా ఆ కెవ్వు కెవ్వులు నిరాఘాటంగా సాగిపోయాయి. ఇప్పుడు చలానికి ముక్కుతో పాటు కళ్ళు, నోరు, చెంపలు, నుదురు, వెరసి మొహం అంతా మంటే.

"చంపేశావు గదే అమ్మా. ఆ మాట కాస్త ముందే చెప్పొద్దా? అమ్మో.... నీ దగ్గర ఇంకో క్షణం వుంటే నీ చిట్కాలతో చంపేస్తావు నన్ను. నేను డాక్టర్ దగ్గరికి వెళ్తాస్తా" మూలుగుతూ పారిపోయాడు చలం.

ఒక గంట తర్వాత చలం డాక్టరిచ్చిన జలుబు మందులు వేసుకుని వాటి సైడ్ ఎఫెక్ట్ ఫలితంగా పడుకుని గుర్రుపెట్టి నిద్రపోయాడు. పాపం కొడుకు తుమ్ములు, జలుబు తగ్గించటానికి పనికొచ్చే చిట్కా కోసం సావిత్రి 'అదేదో' పత్రిక పాత సంచికలన్నీ వెదకటానికి కూర్చుంది. తల్లి ప్రాణం మరి. వెతగ్గా, వెతగ్గా చివరికి ఒక చోట దొరికింది సావిత్రికి కావాల్సిన జలుబు చిట్కా. అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి నూరి, బుంగ మిరపకాయలో కూరి, ఆవనూనెలో వేయించి అది ముక్కు దగ్గరగా పెట్టుకుని పడుకుంటే జలుబు తగ్గుతుందిట. 'అదేదో' పత్రికలో ఆవిడెవరో రాసింది.

వెంటనే నిద్రపోతున్న చలాన్ని లోపల పెట్టి బయట తాళం బిగించి బయల్దేరింది సావిత్రి కావలసిన దినుసులకోసం. మర్నాడు చలం నిద్రలేస్తూనే ముచ్చటపడి కొనుక్కున్న తన బొంబే డైయింగ్ బెడ్‌షీట్, పిల్లో కవర్లూ చూసి కెవ్వుకెవ్వుమన్నాడు. కొడుకు కెవ్వు కెవ్వులు వినిపించగానే లేచివచ్చి ఆనందంగా నవ్వుతూ అంది సావిత్రి.

"ఈ చిట్కా బాగా పనిచేసిందిరోయ్. చూశావా, నువ్వు ఎన్ని కెవ్వులు పెట్టినా ఒక్క తుమ్మూ రాలేదు".



చీర

"లాగే కొద్దీ అనందం ఎక్కువయ్యేదానికి ఒక ఉదాహరణ చెప్పు డాడీ".

"సిగరెట్ బాబూ"

"కాదు నాన్నా ఆ మాత్రం కూడా తెలియదా? చీర."

—ముద్దా రమణమూర్తి
(అనంతపురం)

"నిన్నంతా మందులు మింగితే ఇంకెందుకు వస్తాయే తుమ్ములు?" కోపంగా అరిచాడు చలం.

"అదేం కాదు. మందులకి రోగాలు అంత త్వరగా తగ్గటం ఎక్కడన్నా చూశామా? ఇదంతా నా చిట్కా మహత్యం. ఒక రాత్రంతా అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి, బుంగ మిర్చి, ఆవనూనె వాసన చూస్తే ఎంత జలుబూ తుమ్ములూ ఇట్టే పోవల్సిందే" అదో రూలు అన్నట్లు చెప్పింది సావిత్రి.

"అయితే ఈ దిండ్లు, దుప్పటి కంపు చేసింది నువ్వన్నమాట" తల్లి చాదస్తానికి తల పట్టుకుని కూలబడ్డాడు చలం.

"అమ్మా! ఇంక నువ్వు మారవే. నీ చిట్కాలకి భయపడి నాన్న స్వర్గానికి వెళ్ళిపోతే, చెల్లెళ్ళు పురుళ్లకీ, పండగలకీ కూడా భయపడి రావడం మానేశారు. నేను మాత్రం అమాయకుడ్ని. నీకు చిక్కిపోయాను. ఇంక ఆ చిట్కాలు చదవటం ఆపేయవే. కావాలంటే వడ్డాణం చేయించి పెడతా' ' లావుగా వున్న తల్లి నడుం చూస్తూ దీనంగా అన్నాడు చలం.

"అది కాదురా. ఈ చిట్కాల వల్ల నీ జలుబూ, తుమ్ములూ, తగ్గాయా లేదా?" కమ్‌టు ది పాయింట్ అన్నట్లు అడిగింది సావిత్రి.


"అవి తగ్గింది వాటికి కాదే పిచ్చి నా తల్లీ. నేను వాడిన మందుల వల్ల. ఎక్కడో ఎవడో గొట్టాంగాడో, గొట్టాందో ఏదో చిట్కా రాస్తుంది తిన్నదరక్క. నువ్వేమో అది చేసి కూర్చుంటావు. ఉదాహరణకి కీళ్ల నొప్పి తగ్గాలంటే శీర్షాసనం వేయాలందనుకో, రాకపోయినా సరే శీర్షాసనం వేసి నడుములు విరగ్గొట్టుకుంటావు. ఎన్నాళ్ళ నీతో వేగేది. ఇన్నాళ్ళూ ఎలాగూ ఏడిపించావు. ఇక చాల్లే" బతిమాలాడు చలం.


"నీకు చిట్కాల విలువ తెలియటం లేదురా అబ్బి. ఆ డాక్టరు వంద రూపాయల మందులు రాస్తే నీకు నమ్మకం. నా చిట్కా విలువ చూడు, అయిదు రూపాయలు కూడా లేవు అన్నీ కలిపి" తన చిట్కాలను వెనకేసుకొచ్చింది సావిత్రి.

"అయిదు రూపాయలా. ఈ దుప్పటీ, పిల్లో కవర్ల ఖరీదు నాలుగొందలు. ఉతికించాలన్నా అంత జిడ్డు పోవాలంటే లాండ్రీవాడికి పాతిక. అయినా ముందటి కళ వుండదు. ఇదిటే చవకంటే..." నీరసంగా అన్నాడు ఖర్చుని తలుచుకుని చలం.

"అసలు నువ్విలా చీటికీ మాటికీ చిరాకు పడకుండా ఒక చిట్కా ఉందిరా. రోజూ లేస్తూనే నచ్చిన పనేదన్నా చేసేస్తే రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటుందిట" చెప్పింది సావిత్రి.

"ఇదీ చిట్కాయేనా?" జుట్టు పీక్కుంటూ










## పురుష మోడల్

కొంతమంది నటులు మోడలింగ్ చేసి చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడితే కొంతమంది చిత్ర పరిశ్రమలోకి వచ్చిన తరువాత 'ఆఫర్స్'ను బట్టి మోడలింగ్ చేస్తున్నారు. మొన్నీ మధ్య 'సింథాల్ ఫ్రెష్' అడ్వర్‌టైజ్‌మెంట్‌లో ప్రదర్శించిన ఉత్తమ నటనకు షారుఖ్ ఖాన్‌కు 'ఉత్తమ పురుష మోడల్' అవార్డు లభించింది..! ఉత్తమ స్త్రీ మోడల్ అవార్డు ఎవరికో తెలుసా 'గార్డెన్', 'లాక్మే' ప్రకటనలలో నటించిన ప్రపంచ సుందరి 'ఐశ్వర్యారాయ్..!'

-కృష్ణాజీ



## పుస్తక సమీక్ష




'స్వీట్' అనేసరికల్లా నేచురల్‌గా నోరూరిపోతుంది. స్వీట్‌లో వున్న గొప్పతనం అదే. పండగలకి, శుభకార్యాలకి ఇంట్లో కనిపించే ముఖ్య వంటకం స్వీట్. హాట్ ఇష్టపడనివాళ్లు వుంటారు, స్వీట్‌ని మాత్రం అందరూ లైక్ చేస్తారు. అందుకే స్వీట్ స్వీట్‌గా నవజ్యోతి పబ్లికేషన్స్‌వారు 'స్వీట్' అనే పేరుమీద ఓ మంచి పుస్తకాన్ని రిలీజ్ చేసారు. ఇందులో అనేకరకాల మోడరన్ స్వీట్స్ రుచికరంగా వండుకునే విధానాన్ని చాలా డిటైల్డ్‌గా ఇచ్చారు. లేడీస్‌ని ఆకట్టుకునే

### స్వీట్స్

ఈ స్వీట్స్ బుక్‌ని శ్రీమతి సుజాతా ప్రసాద్ చాలా స్వీట్‌గా రచించారు.

ఇంట్లో తయారు చేసుకునే స్వీట్స్ కొన్ని రకాలే వుంటాయి. కానీ ఈ బుక్‌లో చాలా వెరైటీ స్వీట్స్ తయారు చేసుకునే విధానాన్ని అందరికీ అర్థమయ్యే శైలిలో రాయడం జరిగింది.

సేమ్యా కేసరి, సేమ్యా కోకోనట్ ఖీర్, కొబ్బరి కోవా, బ్రెడ్ హల్వా, మలై హల్వా, మూంగ్‌దాల్ ఖీర్, రాజ్‌భోగ్ లాంటి డిఫరెంట్ వెరైటీ స్వీట్స్ ఎలా తయారు చేసుకోవాలో ఈ బుక్‌లో చాలా చక్కగా వివరించారు. మధురమైన ఈ స్వీట్స్‌ని ఇంట్లో మీరు కూడా తయారుచేసి చూడండి. హ్యాపీహోమ్స్ సిరీస్‌లో రిలీజ్ అయిన ఈ స్వీట్ బుక్ ఖరీదు పది రూపాయలే!

ఈ బుక్ దొరికే అడ్రస్:
నవజ్యోతి పబ్లికేషన్స్,
ఏలూరురోడ్
విజయవాడ—2.

అడిగాడు చలం.

''అవున్రా... 'అదేదో' పత్రికలో...''

''అమ్మా. ఇక నువ్వు బాగుపడవు. నిన్ను వదిలేస్తే గానీ నేను బాగుపడను. లాభం లేదు. ఏ నికోబార్ దీవులకో, లక్షద్వీపాలకో రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ చేయించుకుని నీనుంచి పారిపోవాల్సిందే'' మళ్లీ జుట్టు పీక్కుంటూ అన్నాడు చలం. అప్పటికే చలానికి సగం బట్టతల.

''నీకు నా పోరు తగ్గాలంటే ఇంకో చిట్కా చెప్తారా అబ్బాయి. హాయిగా నచ్చిన పిల్లని చూసి పెళ్ళి చేసుకో. నిన్ను నీ పెళ్ళానికి అప్పచెప్పి మళ్లీ నీ జోలికి రాను'' అంది సావిత్రి.

''వాగ్దానమేనా?'' నమ్మనట్టు అడిగాడు చలం.

''నీమీదొట్టురా. కోడలు వస్తే నీ బాధ్యత ఆ పిల్లే చూసుకుంటుంది కదా... ఇక నేను నిర్విచారంగా చిట్కాలు చదువుకుంటూ కాలం గడిపేస్తా'' చెప్పింది సావిత్రి.

భార్య వస్తే తల్లికి కాస్త కాలక్షేపం జరిగి పుస్తకాలు చదవటం మానేస్తుందేమో అని దురాశ పడిన చలం ఒక శుభ ముహూర్తాన తల్లికీ, తనకూ, నచ్చిన శోభ మెళ్లో మూడు ముళ్ళేశాడు.

కాపురానికొచ్చిన తొలిరోజే ప్రేమగా బ్రష్ మీద పేస్ట్ వేసి అందిస్తున్న భార్యని చూసి ''ఆహా రోజులు మారాయి. వుందిలే మంచి కాలం ముందు ముందునా...'' అని మనసులోనే పాడేసుకున్నాడు చలం.

బ్రష్ నోట్లో పెట్టుకోవడం ఆలస్యం, మళ్ళీ కెవ్వు కెవ్వులు మొదలయ్యాయి. 'కొడుకు ఎందుకు కెవ్వు కెవ్వులు పెడుతున్నాడా? తానేం చిట్కా చేయలేదే?' అర్థం కాక పరిగెత్తుకొచ్చింది సావిత్రి.

''ఏమయిందిరా అబ్బాయి. ఇప్పటి నుంచే అలా కెవ్వుకెవ్వులు పెట్టి కొత్తగా కాపురానికొచ్చిన పిల్లని దడిపించబోకు'' కేకలేసింది సావిత్రి.

''అదికాదే అమ్మా. ఈ బ్రష్ అంతా చేదు పుట్ట... విషం... అబ్బా... అమ్మా... థూ...'' చలం బ్రష్ పుచ్చుకుని ఇల్లంతా కలియతిరిగాడు.

అప్పుడు చెప్పింది శోభ. ''అదాండీ. మరేమో రాత్రంతా బ్రష్‌ని వేపరసంలో నానబెట్టి ఉదయాన దాన్ని కడక్కుండా దానిమీదే పేస్ట్ వేసుకుని పళ్ళు తోముకుంటే పళ్ళు, చిగుళ్లు ఆరోగ్యంగా, గట్టిగా వుంటాయని పత్రికల్లో....''

''చిట్కానా అమ్మా...?'' ఆనందంగా మొహం ఇంత చేసుకుని అడిగింది సావిత్రి.

''హతవిధీ... '' జుట్టు పీక్కుంటూ కూలబడిపోయాడు చలం.


''అవునా? నాకు తెలియదే అమ్మాయి. నేనింకా 'అదేదో' పత్రిక మాత్రమే కొంటున్నా. దాంట్లో పిసినారి వెధవ ఆ ఎడిటరు ఏదో ఒక్క పేజీలో అర్ధకాలమ్ మాత్రమే చిట్కాలు వేస్తాడు. 'ఇదేదో' పత్రికలో కూడా చిట్కాలు వేస్తున్నట్లు నాకు తెలిసుంటే అదీ కొనేదాన్ని'' వాపోయింది సావిత్రి.

''పోన్లెండి అత్తయ్యా. 'ఇదేదో' పత్రిక పాత సంచికలన్నీ నాతోపాటే తెచ్చాను. మీరూ చదువుదురు గాని''.

''నా తల్లే. లక్షలకి మించి విలువైన సారె తెచ్చావమ్మా'' మెచ్చుకుంది సావిత్రి కోడల్ని.

చలం మాత్రం నాలుకా, జుట్టూ పీక్కుంటూనే వున్నాడు. ఇప్పుడతనికి పూర్తిగా బట్టతల. *





### కామెడీ విలన్..!

తమిళంలో హీరోగా పరిచయమై ఒక వెలుగు వెలిగి మెల్లగా తెలుగులో సెకండ్ హీరో వేషాలు వేసి చివరకు తన పంథాలో విచిత్రమైన గొంతుతో వెకిలి వేషాలతో కామెడీ విలన్‌గా మారిపోయిన తెలుగు కుర్రాడు 'సుధాకర్'. హీరో వేషాలే కావాలనుకుంటే 'పీచేముడ్' అనేది పరిశ్రమ. నాకు తగ్గ వేషాలూ, ప్రజలు నన్ను రిసీవ్ చేసుకునే వేషాలు ప్రస్తుతం కామెడీ విలన్‌గానే...! అందుకనే ఒప్పుకుంటున్నాను... అనే సుధాకర్ నిర్మాతగా 'చిరంజీవి'ని పెట్టి సినిమా కూడా నిర్మించాడు. త్వరలో మరో వెరైటీ చిత్రం ప్లాన్ చేద్దామనుకుంటున్నాడట..!

-కృష్ణాజీ

